క్లుప్తంగా

ఘనంగా మాతృభాషా దినోత్సవం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా మాట్లాడారు. విద్యార్థులు చ దువుతో పాటు సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తే భావన శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు లవీన మంజులత, నాగభూషణం, శంకర్, ప్రశాంతి, కళాశాల ఏఓ మక్బూల్ అహ్మద్ ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అలంపూర్: అలంపూర్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ మహ్మద్ మక్బూల్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నా రు. 33 కేవీ శాంతినగర్-2 ఫీడర్‌లోని లైన్లకు తాకే చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేప డుతున్నట్లు తెలిపారు. అలంపూర్ సబ్ డివిజ న్ పరిధిలోని శాంతినగర్ సెక్షన్, మానవపాడు సెక్షన్ల, 33/11కేవీ సబ్ స్టేషన్లు శాంతినగర్, రాజోళి, మానవపాడు, కలుకుంట్ల(శ్రీనగర్) స బ్ స్టేషన్‌లలో 11 కేవీ ఫీడర్ల విద్యుత్ సామగ్రి, మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఐకి ఘన సన్మానం



ధరూరు: ఇటీవల మండలానికి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను మండల నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు కలిసి సన్మానించారు. బుధవారం ఎన్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు ఆధ్వర్యంలో శాలువా, బొకేతో సన్మానించారు. మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ కోరారు.

అయిజ ఎంపీపీ ఎన్నిక సమావేశం

గద్వాల రూరల్: అయిజ మండల పరిషత్ అధ్యక్షులు, అదేవిధంగా ప్రజాపరిషత్ ఎన్నికకు ఈనెల 28న సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బీఎం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నిక నిర్వహణకు జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ప్రసాద్‌రావును నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ల దొంగ రిమాండ్‌కు

గద్వాల క్రైం: ప్రయాణికుల సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వనపర్తి జిల్లా మదనాపురం గ్రామానికి చెందిన నూర్‌బాషా మంగళవారం ఉదయం గద్వాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అప్రమత్తమై రైల్వేస్టేషన్‌లో నిందితుడిని చాకచక్యంగా పట్టుకొని విచారణ చేయగా, గతంలో సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల స్వయం పరిపాలన



గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. కలెక్టర్‌గా అన్వర్‌బాషా, జాయింట్ కలెక్టర్‌గా ఇశాంత్, ఎంఈఓగా చరణ్, హెడ్మాస్టర్‌గా రోహిత్‌సాగర్, 30 మంది ఉపాధ్యా యులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఓబులేష్, ఉపాధ్యాయులు శివశంకర్, శివప్రసాద్, రాజుసాగర్, పరశురాం, నర్సింహులుగౌడు, హాజీపాషా, నర్సింహులు, ఆశాబీ, గణేష్, రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

గద్వాలలో మట్టి దొంగలు

- ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు



అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు (ఫైల్)

గద్వాల అర్బన్: గద్వాల మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నారు. దీనిని అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పట్టపగలు తమ కళ్లముందే పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

దర్జాగా దందా..

గద్వాల మండలంలోని గద్వాల, నది అగ్రహారం, చెనుగోనిపల్లి, అనంతపురం, వెంకంపేట, జమ్మిచేడు, శెట్టి ఆత్మకూర్ తదితర గ్రామాల శివారులో జోరుగా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. మరోవైపు అనంతపురం సమీపంలోని చేనేత పార్కుకు కేటాయించిన స్థలంలో అడ్డగోలు తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూములు, గుట్టలను జేసీబీ, ట్రాక్టర్లు, టిప్పర్ల సహాయంతో గుట్టలు తవ్వేస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.1000 నుంచి రూ.1400 వరకు, టిప్పర్‌కు రూ.7వేల వరకు వసూలు చేస్తున్నారు. చెనుగోనిపల్లి గ్రామ శివారులో రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నా అడిగే నాథుడు కరువయ్యారు. ఇలా ప్రతిరోజు మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణ శివారులో తవ్వకాలు చేపడుతూ మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు చేపడుతున్న ఆయా శాఖల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. అక్రమంగా తవ్వకాలు చేపట్టి గృహ నిర్మా ణాలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ప్రతిరోజు ఆయా గ్రామాల మీదుగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు తిరగడంతో రోడ్లు గుంతలమయంగా మారుతోంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా యి. దీనిపై అధికారులు స్పందించక పోవడంతో పలు ఆరోపణలు వస్తున్నాయి.

ఇటీవల దాడుల్లో పట్టుబడినవి..

- ఈనెల 6న గద్వాల మండలంలోని అనంతపురం సమీపంలో అక్రమంగా గుట్టలను మట్టి తవ్వకాలు చేపడుతున్న 4 టిప్పర్లు, 9ట్రాక్టర్లను ప్రత్యేక పోలీస్ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి.
- ఈనెల 17న మండలంలోని చెనుగోనిపల్లి వాసులు పట్టణ శివారులో గుట్టలను తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 12 ట్రాక్టర్లు, 2 ఎక్స్‌కావేటర్లు పట్టుకొని యాజమానులపై కేసులు నమోదు చేశారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

మండలంలోని ఆయా గ్రామాల నుంచి మట్టి తవ్వకాలు చేపట్టి విలువైన ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ, పట్టా భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి మేరకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అక్రమార్కులు అవేమీ లేకుండానే జోరుగా తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. మట్టి మాఫియా రూ.లక్షల్లో ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మట్టి మాఫియా అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూముల్లోని మట్టిని కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం పట్టణంలో యథేచ్ఛగా ట్రాక్టర్లు తిరుగుతుంటే సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం ఇందుకు మరింత బలం చేకూరుతోంది. మరోవైపు తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచే మట్టి ట్రాక్టర్లు వెళ్తున్నా ఆ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మైనింగ్ శాఖ అధికారులు అయితే తనిఖీ చేపట్టి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పలువురు విమర్శిస్తున్నారు. అక్రమ దందాలపై నిఘా పెట్టాలని ఇటీవల ఎస్పీ రితిరాజ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మట్టి తవ్వకాలకు రెవెన్యూ అనుమతి తీసుకోని మైనింగ్ శాఖకు రాయల్టీ చెల్లించాలి. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టరాదు. ఎవరైనా అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మట్టి తరలిస్తున్న రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారనేది అవాస్తవం. అక్రమంగా మట్టి తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, తహసీల్దార్, గద్వాల

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

రాజోళి: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్యే విజేయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ముండ్లదిన్నెలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సమయానికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తప్పకుండా భోజనంపై, విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మిళ్ల ఇసుక రీచ్ వద్ద నిరసన



జేసీబీతో గుంతలు తీస్తున్న స్థానికులు

రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో తుంగభద్ర నది దగ్గర ఉన్న ఇసుక రీచ్ వద్ద స్థానికులు బుధవారం నిరసన తెలిపారు. టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇక్కడ ఇసుక తవ్వకాలు చేసేందుకు కాంట్రాక్టర్‌కు అనుమతులొచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక రవాణా నిలిచిపోయింది. తాజాగా మళ్లీ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు రీచ్ వద్దకు వెళ్లి టిప్పర్లు తిరగకుండా జేసీబీలతో గుంతలు తవ్వి పనులు అడ్డుకున్నారు. నిబంధనల మేరకు రీచ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సామర్థ్యానికి మించి ఇసుకను లోడ్ చేసుకోకూడదని చెప్పినా అవేమీ పట్టకుండా పనులు చేయడం కుదరదని పేర్కొన్నారు. టిప్పర్లలో ఇసుక అధికలోడ్ చేయడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, దీనిపై కనీస పర్యవేక్షణ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు పనులు జరిగేంతవరకు పనులు అడ్డుకుంటామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. దీంతో ఇసుక తవ్వకాల పనులు నిలిచిపోయాయి.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొడదాం



సామూహిక పుస్తక పఠనం చేస్తున్న నాయకులు

అలంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకోని బుధవారం రెడ్ బుక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా 'లెనిన్ ఓ విప్లవ ఆయుధం' అనే పుస్తకాన్ని సామూహికంగా పఠనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాట్లాడుతూ లెనిన్ చనిపోయి వందేళ్లు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా లెనిన్ జీవిత చరిత్రకు సంబంధించిన సామూహిక పుస్తక పఠనం చేపట్టినట్లు తెలిపారు. 17 ఏళ్ల వయసులోనే లెనిన్ విప్లవ కార్యాచరణ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. జార్ చక్రవర్తి పాలనకు వ్యతిరేకంగా కార్మికులను రైతులను, ప్రజలను సమీకరించి పోరాటం చేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఒంటరి చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రజల మధ్య మత వైశ్యామ్యాలు పెంచి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి బీజేపీ చూస్తోందని ఆరోపించారు. సమావేశంలో నాగరాజు, ఆశన్న, మాలిక్ బాషా, రఫీ, సర్దార్ ఉన్నారు.

డీసీసీబీ శాశ్వత భవనం కోసం స్థల పరిశీలన



ఎర్రవల్లిలో డీసీసీబ్యాంక్ శాశ్వత భవనం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో డీసీసీ బ్యాంక్ శాశ్వత భవనం నిర్మాణం కోసం బుధవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ వెంకటయ్య, సీఈఓ లక్ష్మయ్య, డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలు షేకుపల్లి రోడ్డులోని పీఏసీఎస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీ బ్యాంక్ శాశ్వత భవనం నిర్మాణం కోసం స్థలం, వసతులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎర్రవల్లిలో నూతన డీసీసీబీ భవనం నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అంతకుముందు బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

నూతన వంతెన నిర్మించండి



అయిజ: కర్నూల్–అయిజ రోడ్డు రహదారిలో పెద్ద వాగుపై గతంలో నిర్మించిన వంతెన శిథిలమై అనేక సంవత్సరాలవుతోంది. అక్కడ అనేక సార్లు ప్రమాదాలు సంభవించాయి. బ్రిడ్జి పక్కన కిందిభాగంలో ఏర్పాటు చేసిన రాతిగోడ కొన్నేళ్ల కిందటే శిథిలమైంది. బ్రిడ్జి ఉన్నట్లు సూచించే రక్షణ రాళ్లు విరిగి పోయాయి. వాహనాలు దగ్గరకు వస్తేగాని చోదకులకు అక్కడ ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలియడంలేదు. అధిక బరువు కలిగిన వాహనాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తుంటాయి. దీంతో బ్రిడ్జి బీటలు వారింది. అధికారులు స్పందించి నూతన బ్రిడ్జిని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

పీఎం కిసాన్‌కు ఆధార్ లింక్ తప్పనిసరి



మానవపాడు: పీఎం కిసాన్ అమౌంట్ వచ్చే రైతులు ఈకేవైసీ, అకౌంట్ బుక్ లింక్ తప్పనిసరిగా చేసు కోవాలని ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. బుధవారం మండకేంద్రంలో ఈకేవైసీ, ఆధార్ లింక్‌లపై అవగాహన కల్పించారు. రైతులకు ఆర్థికసాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి యోజన రైతులకు భరోసా అందించేందుకు రైతులకోసం ప్రతి సంవత్సరం రూ.6వేలు వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ పథకం తప్పనిసరిగా సొంత భూమి ఉన్న వారు పీఎం కిసాన్‌కు ఆ ధార్ కార్డు లింక్ తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి సుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి మణి ప్రకాశ్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీధర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించండి



శాంతినగర్: గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని మిషన్‌భగీరథ ఏఈ వంశీసాగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం, తి మ్మాజిపల్లి, జక్కిరెడ్డిపల్లి, జూలెకల్ గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏఈ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ట్యాంకుల వద్దకు వెళ్లి ఎలా శుభ్రం చేయాలనే విషయమై డెమో చేసి చూపించారు. ట్యాంకులు శుభ్రం చేస్తేనే నీరు కలుషితం కాకుండా ఉంటుందని, పైప్‌లైన్‌లు ఎక్కడా లీకేజీలు కాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లకు ఏఈ సూచించారు.

జీహెచ్‌ఎంకు ఉపాధ్యాయుల సన్మానం

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర‌రెడ్డిని ఉపాధ్యాయులు బు ధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఉ ప్పేరు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులంతా శా లువా, పూల మాలలతో సన్మానించారు.



గోల్డ్‌మెడల్‌కు విద్యార్థినుల ఎంపిక



అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల అర్బన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్‌కు ఎంపిక చేశారు. గద్వాల మండలం కొత్తపల్లికి చెందిన నందిని అత్యున్నత ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్‌కు ఎంపికైంది. 2017–2020 విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బిజెడ్‌సీ పూర్తి చేసింది. 2020–22 విద్యా సంవత్సరంలో మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసింది. ఈ కోర్సులో 78.33 శాతం ఫలితాలు సాధించి ప్రతిభ చాటింది. పాలమూరు యూనివర్సిటీ 2024లో ప్రకటించిన 4వ కాన్వకేషన్ గోల్డ్ మెడల్ అవార్డుకు నందిని ఎంపికైంది. ఆమె త్వరలో పీయూలో గోల్డ్‌మెడల్‌ను అందుకోనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాల అధ్యాపకులు నందినిని అభినందించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని నందినిని అభినందించారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో 2022 విద్యాసంవత్సరంలో రుక్సానాబేగం బీఎస్సీ మ్యాథ్స్, సైన్స్ విభాగంలో ప్రతిభ చాటింది. ఈ కోర్సులో 94శాతం ఫలితాలు సాధించి గోల్డ్ మెడల్ సాధించింది. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో కలెక్టర్ బీఎం సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుక్సానాబేగంను కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సివిల్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మాకం బీచుపల్లి, ప్రిన్సిపాల్ వినీల, అధ్యాపకులు జ్యోతి, ఖయ్యూం, ఆర్షియా, అనిల్, పారిజాత, విజయ్‌కుమార్ ఉన్నారు.

గ్రామదేవతల ఉత్సవాలు



మాశమ్మకు బోనంతో వెళ్తున్న ప్రజలు

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలో మారెమ్మ, మశమ్మ, జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వివిధ గ్రామాల ప్రజలు హాజరై భక్తిశ్రద్ధలతో గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిలిచే మారెమ్మ, మశమ్మ గ్రామ దేవతలకు పొట్టేళ్లు బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. హిందువులు, ముస్లింలు సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. గ్రామంలో జాతర వాతావరణం నెలకొంది. గ్రామంలో వీధులన్నీ జనంతో నిండిపోయాయి. జాతరకు కర్ణాటక, ఆంధ్రరాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.

మడివాల మాచిదేవ ఆలయంలో హోమాలు



మడివాల మాచిదేవ ఆలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్దకల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మడివాల మాచిదేవ ఆలయంలో బుధవారం గణపతి హోమాలు వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, ప్రసన్నచారి ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మండపంలో సకలదేవతల దోషనివారణ హోమం, ధాన్యాధివాసం, పుష్పశయ్యాదివాసం, వాస్తు దేవతా హోమాలను నిర్వహించారు. గురువారం నూతన ఆలయంలో మడివాల మాచిదేవ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా హోమాలు నిర్వహించినట్లు వేదపండితులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, బాబురావు, వేదపండితులు, ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

మానవపాడు: పదో తరగతిలో పదికి పది ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో కంటే మెరుగైనా ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తరగతులలో వెనుకబడిన విద్యార్థులు ప్రతి ఒక్కరూ పదికి పది మార్కులు సాధించాలనే ఉద్దేశ్యంతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, ఎంఎన్‌ఓ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ అధికారి రాజు

గట్టు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు కోరారు. బుధవారం గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు పల్స్ పోలియోపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు మాట్లాడుతూ 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పని సరిగా చుక్కల మందును వేయించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది కలిసి పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజు, సీహెచ్‌ఓ ఊసేని, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, సూపర్ వైజర్లు మక్సూద్, స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో వానరాలు



గద్వాల పట్టణంలో కోతుల గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పలు కాలనీల్లో ఇళ్లపై దూకుతూ, వీధు ల వెంట తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పదుల సంఖ్యలో తిరుగూతు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. దీంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోని కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తున్న ఈ దృశ్యాలు బుధవారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

– గద్వాల అర్బన్

వ్యక్తి గాయాలు : కేసు నమోదు

ఉండవెల్లి: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి గాయాలైన ఘటన బుధవారం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎర్రవల్లి మండలం బట్లదిన్నెకు చెందిన దేవన్న కర్నూల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇటిక్యాలపాడు శివారులో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దేవన్నకు కుడి భుజం, మెడకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ని వెంటనే స్థానికులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అతని తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

నేడు బొడ్రాళ్ల ప్రతిష్ఠోత్సవం

ఆత్మకూర్: తూంపల్లిలో గురువారం బొడ్రాళ్ల ప్రతిష్ఠోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 7 గంటలకు గణపతి పూజ ప్రారంభమవుతుంది.